క్లుప్తంగా

గోదావరి పరవళ్లు



అప్పనపల్లి రేవులో పరవళ్లు తొక్కుతున్న గోదావరి

మామిడికుదురు: గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తీర గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాల్లోని రైతులు పసుగ్రాసంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి రోజు నాటు పడవలపై తరలించుకోవాల్సిందే. గోదావరి వరద ప్రవాహంతో రైతులు అవస్థలు పడుతున్నారు. పడవలపై పచ్చగడ్డి, పాలు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకోవడం ఎంతో కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో వరద ఉధృతితో ఇబ్బందులు పడ్డామని చెప్పారు. మళ్లీ వరద శాంతించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ రెండ్రోజుల నుంచి వరద పెరుగుతూ ఉడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆగస్టు నెలాఖరు వరకు గోదావరి వరదల సీజన్ కావడంతో తమకు అవస్థలు తప్పడం లేదని రైతులు పేర్కొన్నారు. వరద ప్రవాహం ప్రమాదకర స్థితికి చేరుకుండా శాంతించాలని రైతులు వేడుకుంటున్నారు.

తాగుబోతులకు అడ్డాగా బస్టాండ్



ముక్కామల బస్టాండ్‌లో మద్యం సీసాలు

అంబాజీపేట: ముక్కామల బస్టాండ్ తాగుబోతులకు అడ్డాగా మారిపోయింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విచ్చలవిడిగా బస్టాండ్‌లోనే మద్యం తాగుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు బస్టాండ్ వద్ద వేచి ఉండాలంటే భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో అయితే బస్టాండ్ మినీ బార్‌గా మారిపోతుందని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు. వర్షానికి ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లి ఉండాలంటే భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీరేశ్వరస్వామికి మకరతోరణం సమర్పణ




జి.అగ్రహారంలో స్వామి వారికి మకర తోరణం సమర్పిస్తున్న నరసింహమూర్తి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన పార్వతీ సమేత వీరేశ్వర స్వామికి మండల లక్ష్మి నరసింహమూర్తి, కమలావతి దంపతులు, వీరి కుమారులు, మనుమలు ఇత్తడి మకర తోరణాన్ని ఆదివారం సమర్పించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహిళకు ఆర్థిక సాయం

మలికిపురం: మామిడికుదురు మండలం గోగున్నమఠం గ్రామానికి చెందిన ముత్యాల ఉమా మహేశ్వరికి అత్యవసరంగా కడుపులో కణతి తొలగించే ఆపరేషన్ చేశారు. ఆమె కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని స్థానికులు మానవతా గ్రూపు సంస్థకు తెలిపారు. ఆమె కుటుంబ ఇబ్బందులు స్వయంగా గమనించిన ప్రవాసాంధ్రుడు సుంకర లోకేష్ (శ్రీకృష్ణపట్నం, అమెరికా) కు తెలియజేయడంతో ఆయన రూ.5 వేలు పంపారు. ఈరోజు బాధితురాలి భర్త పెద్దిరాజు బోనం నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు.

శివాలయం పునర్నిర్మాణానికి రూ.25,232 విరాళం



విరాళం ఇస్తున్న దాతలు

సఖినేటిపల్లి: మోరి శివాలయం పునర్నిర్మాణం నిమిత్తం మోరి గ్రామానికి చెందిన పడవల వీర వెంకట సత్యనారాయణ, పడవల పద్మావతి దంపతులు, కుటుంబ సభ్యులు కలిపి రూ.25,232 విరాళం ఆదివారం అందజేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీకి వారు ఇచ్చారు.

ఎంపీటీసీలకు ఏదీ గౌరవం!

- గౌరవ వేతనం విడుదలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ సభ్యుల పట్ల పాలకులు, అధికారుల చిన్నచూపు
- కూటమి నేతలకే పెత్తనం



కొత్తపేట మండల పరిషత్ కార్యాలయం

కొత్తపేట: రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పడి ఏడాది దాటింది. ఎన్నికల హామీలను గాలికి వదిలిన ప్రభుత్వం పాలన వ్యవహారాల్లో సైతం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టి, కూటమి నేతలకు పెత్తనం అప్పగిస్తున్నారనే విమర్శలున్నాయి. 90 శాతం స్థానిక సంస్థలు వైఎస్సార్ సీపీ ఖాతాలోనే ఉన్నాయి. దాంతో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలపై, ఆ ప్రజాప్రతినిధులపై చిన్నచూపు చూస్తుందని ఆరోపణలు ఉన్నాయి. పలు మండలాల్లో ప్రజల నుంచి ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయకుండా అధికార పార్టీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇది కూటమి ప్రభుత్వ మార్కు ప్రజాస్వామ్యమా? అని పలువురు ప్రజాప్రతినిధులు వాపోయారు. ఈ విధానాన్ని పలువురు తీవ్ర అభ్యతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకు గౌరవ వేతనం కూడా విడుదల చేయలేదు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా అధికార టీడీపీ, జనసేన నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో 229 ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వారికి ప్రతినెలా రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023 జూన్ వరకూ రెండు విడతలుగా చెల్లించారు. 2024లో బిల్లు పెట్టి మూడో విడత చెల్లించేందుకు చర్యలు తీసుకునే సమయంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడం, ఆ ఎన్నికల నేపథ్యంలో గత ప్రభుత్వం ఎంపీటీసీ సభ్యులకు చెల్లించలేకపోయింది. 2024 జూలై 30న కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రస్తుతం వేతనాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి సర్కారు వీటిపై కనీస దృష్టి సారించలేదు. 2021 సెప్టెంబర్ చివరి వారంలో ఎంపీటీసీలు ప్రమాణస్వీకారం చేయగా అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకూ 45 నెలలు కాగా 21 నెలలకు గౌరవ వేతనం చెల్లించారు. ఇంకా 24 నెలలకు చెల్లించాల్సి వుంది. కూటమి సర్కారు వచ్చిన తర్వాత ఇప్పటికి రెండుసార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగినా ప్రజాప్రతినిధుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. ఏది ఏమైనా ఎంపీటీసీలకు గౌరవం, గౌరవ వేతనం అందని ద్రాక్షలా మారింది.

మూడు నియోజకవర్గాల్లో ఎంపీటీసీ సభ్యులు

నియోజకవర్గం	ఎంపీటీసీ సభ్యులు
కొత్తపేట	88
పి.గన్నవరం	74
రాజోలు	67
మొత్తం	229

నిధులు లేవు.. విధులు లేవు



ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు ఇవ్వక పోవడమే కాదు. తమ పరిస్థితి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు మాత్రమే పరిమితం అన్నట్లుగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంపీటీసీ సభ్యులకు నిధులు లేవు.. విధులు లేవు. కనీసం గౌరవ వేతనాలైనా వెంటనే విడుదల చేయాలి.

– నేలపూడి భీమరాజు, ఎంపీటీసీ సభ్యుడు, వాడపాలెం

గౌరవ వేతనం మంజూరు చేయాలి



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా మాకు ఇప్పటికీ గౌరవ వేతనాలు ఇవ్వలేదు. రెండు సంవత్సరాలకు చెల్లించవలసి ఉంది. మూడు నెలలకు ఒకసారి మండల పరిషత్ సమావేశానికి వెళ్లడం తప్ప అంతకు మించి గౌరవం కనిపించడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గౌరవ వేతనం నిధులు విడుదల చేయాలి.

– దూళి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు, అవిడి

'యువత-భవిత' చర్చలో తృతీయ స్థానం



మండపేటలో బహుమతులు అందుకున్న కొత్తపేట విద్యార్థినులు

కొత్తపేట: మండపేట ఉన్నత పాఠశాలలో 'యువత-భవిత' అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో (డిబేట్ కాంపిటీషన్) స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల టీమ్ తృతీయ స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. డాక్టర్ చల్లా వెంకట్రావు 17వ వర్ధంతి సందర్భంగా సంగమం-మండపేట వారు ఆదివారం ×యువత-భవిత¬ అనే అంశంపై డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. టీమ్‌కు డిగ్రీ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు చొప్పున జిల్లా స్థాయిలో వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 20 టీమ్‌లు పాల్గొన్నాయి. కొత్తపేట డిగ్రీ కళాశాల నుంచి బీకాం మూడో సంవత్సరం చదువుతున్న బేబీ సత్యవాణి, పల్లవి, మీనాక్షి, అధ్యాపకులతో కలిసి వెళ్లి పోటీల్లో పాల్గొన్నారు. వివిధ సామాజిక అంశాలపై ఐదు రౌండ్లలో పోటీలు నిర్వహించగా కొత్తపేట విద్యార్థినుల టీమ్ తృతీయ స్థానంలో నిలిచి ప్రముఖులు చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్నారు. వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు అభినందించారు.

కర్బలా యాత్రకు ముస్లింల బృందం

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ అతని కుటుంబంతో పాటు 72 మంది ఇరాక్‌లోని కర్బలా పుణ్యభూమిలో వీర మరణం పొందారు. వారు మృతి చెంది 40 రోజులు పూర్తయిన సందర్భంగా జరిగే అర్బయీన్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరం, మామిడికుదురు గ్రామాలకు చెందిన మహిళా భక్తుల బృందం ఆదివారం ఇరాక్ బయలుదేరింది. ఈ బృందం సభ్యులు నగరం గ్రామంలోని పంజీషా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. వీరికి స్థానిక ముస్లింలు వీడ్కోలు పలికారు.

హజ్ యాత్ర దరఖాస్తుకు 31 వరకూ గడువు

మామిడికుదురు: హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడు ముకరం హుస్సేన్ తెలిపారు. ఆయన మామిడికుదురులో ఆదివారం హజ్ యాత్ర దరఖాస్తులను సున్నీ జామియా, షియా జామియా మసీదు ప్రతినిధులకు అందజేశారు. హజ్-2026 దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. 2026 డిసెంబరు 31వ తేదీ వరకు చెల్లుబాటు అయ్యే మెషీన్ రీడబుల్ పాస్‌పోర్టు ఉండాలన్నారు. దరఖాస్తులు హజ్ సువిధ యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. ఎంపికైన యాత్రికులకు ముందస్తు చెల్లింపుగా రూ.1,52,300 డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, మసీదు కమిటీ అధ్యక్షుడు మసూద్ మొహిద్దీన్, కార్యదర్శి అబ్దుల్ సలామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు

- కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు
- మూడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ



కె.జగన్నాథపురంలో బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీలో భాగంగా రచ్చబండ నిర్వహిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు



సోంపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

అయినవిల్లి: ప్రజలను సీఎం చంద్రబాబునాయుడు తన మాటలతో మోసగించడంలో సిద్ధహస్తుడని మరోసారి నిరూపించుకున్నారని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని మండలంలోని కె.జగన్నాథపురం, తొత్తరమూడి, శానపల్లిలంక గ్రామాల్లో పార్టీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉంటే చాలు అడిగినా, అడగకపోయినా పథకాలు అమలు చేశారని అన్నారు. వలంటీర్ వ్యవస్థతో ప్రజలను అనేక సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు మాజీ సీఎం జగన్ అందజేశారన్నారు. వలంటీర్ వ్యవస్థ తొలగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మధ్యవ్యక్తుల ప్రమేయంతోనే ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమం అర్హత ఉన్నా ఇవ్వడం లేదని ఆరోపించారు. సూపర్‌సిక్స్ పేరిట పేద ప్రజలను కూటమి ప్రభుత్వం పూర్తిగా మోసగించిందన్నారు. గ్రామాల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. బాబూ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మిపోయారన్నారు. కార్యక్రమంలో కె.జగన్నాథపురం సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, మట్టపర్తి వెంకటరమణ, కుడుపూడి రామకృష్ణ, వాసంశెట్టి తాతాజీ, యడ్ల కిరణ్, మద్దింశెట్టి రాంబాబు, చేట్ల రామారావు, బొంతు శ్రీను, కమిడి వెంకటేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలు.. ప్రజలకు శాపాలు: మాజీ మంత్రి గొల్లపల్లి ఫైర్

రాజోలు: చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీల మోసాలు ప్రజల పాలిట శాపాలుగా మారాయని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మండిపడ్డారు. ఆదివారం సోంపల్లిలో సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్రలు ప్రసంగించారు. ఎన్నికల్లో ప్రజలను మోసగించేందుకు ఇచ్చిన హామీలైన అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను వివరించి ×రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో¬ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజ్యాంగ విరుద్ధ పాలన సాగుతోందని, తప్పుడు కేసుల పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను వివరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇటీవల ఎన్నికైన మండల పార్టీ కార్యవర్గ సభ్యులతో పాటు, మండలంలోని 16 గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన పార్టీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులను మాజీ మంత్రి గొల్లపల్లి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలు కీలకంగా నిలవాలన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, రాష్ట్ర ప్రచార కమిటీ అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్, మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, జిల్లా ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఉచ్చుల దాసు, జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చుల విష్ణుమూర్తి, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల్లా పంట కాలువలు



మాచవరం-చిరతపూడి పంట కాలువలో పేరుకు పోయిన చెత్తాచెదారం, పశువుల కళేబరాలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పంట కాలువలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. అన్ని రకాల వ్యర్థాలను కాలువలోనే నేరుగా వేసేయడంతో పంట కాలువ కాస్తా మురుగు కాలువలా మారిపోయింది. దీంతో దిగువ పంట పొలాలకు సాగు నీరు వెళ్లేందుకు సైతం అవరోధాలు ఏర్పడుతున్నాయి. దీన్ని సరిచేయాల్సిన సంబంధిత అధికారులు నిత్యం ఆ మార్గంలో వెళుతున్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాచవరం నుంచి చిరతపూడి వెళ్లే ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ గ్లాస్‌లు, బాటిల్స్, బీరు, బ్రాందీ సీసాలతో పాటు పశువుల కబేళాలతో కాలువంతా నిండిపోయింది. పంట కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి పశువుల కబేళాలు కనిపిస్తున్నా ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే బాత్‌రూమ్‌ల వాడకం గొట్టాలను పంట కాలువ వెంబడి ఏర్పాటు చేశారని వాటిని తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు వివరించినా వారికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని రైతులు వాపోయారు. పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాల వల్ల దుర్వాసన వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు, రైతులు, ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి తక్షణమే పంట కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం, పశువుల కళేబరాలు, బాత్‌రూమ్ గొట్టాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 31 మంది, శ్రీలక్ష్మీగణపతిహోమంలో 16 జంటలు పాల్గొన్నాయి. ఐదుగురు చిన్నారులకు తులాభారం, అన్నప్రాశన నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,17,102 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



అప్పనపల్లి ఏటిగట్టు రోడ్డుకు నిర్వహిస్తున్న పనులు

మామిడికుదురు: మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు రోడ్డుకు ఎట్టకేలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఏటిగట్టు నుంచి అప్పనపల్లి వైపు వెళ్లే మార్గంలో చిప్స్ వేసి అక్కడి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో వాహనదారులు, స్థానికులు గత కొన్ని రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ×సాక్షి¬లో పలు కథనాల ద్వారా వివరించడం జరిగింది. దీంతో పాటు స్థానికులు కూడా సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్పందించారు. చర్యలు తీసుకోవాలని, సమస్యను పరిష్కరించాలని పెదపట్నం గ్రామ పంచాయతీకి సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు సర్పంచ్ గుబ్బల దుర్గ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. అప్పనపల్లి ఉచ్చులవారి పేట వాసులు శ్రమదానం పనులు నిర్వహించడంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారం అయింది.

'తమ్మన'కు అభినందనలు

ఆలమూరు: మండల కన్వీనర్‌గా నాలుగో సారి ఎంపికైన తమ్మన శ్రీనివాసుకు అభినందనలు వెల్లువెత్తాయి. సంధిపూడి, మూలస్థాన అగ్రహారం గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు ఆదివారం చెముడులంకలోని తమ్మన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో మాదిరిగానే పార్టీ అభ్యున్నతికి కృషి చేసి 2029లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

రహదారి అభివృద్ధి చేయాలంటూ నిరసన



కె.జగన్నాథపురం రోడ్డు గుంతల్లో వరినాట్లు వేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అయినవిల్లి: ముక్తేశ్వరం-ముమ్మిడివరం వరకూ ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రహదారి గుంతల్లో వరి నాట్లు చేసి నిరసన తెలిపారు. కె.జగన్నాథపురం, తొత్తరమూడి, శానపల్లిలంక గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిపారు. ముక్తేశ్వరం నుంచి ముమ్మిడివరం వరకూ పాడైన ఆర్‌అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేయాలని కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలుత పార్టీ నాయకులతో కలసి కె.జగన్నాథపురం నుంచి ముక్తేశ్వరం వరకూ రహదారిపై పాదయాత్ర చేశారు. పార్టీనాయకులు, కార్యకర్తలు ఈ రహదారిని అభివృద్ధి చేయాలంటూ నినాదించారు. రహదారిపై గుంతలు ఉండి నీరు నిలబడిన చోట్ల పార్టీ నాయకులతో కలసి వరినాట్లు వేసి నిరసన తెలిపారు. గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ముఖ్యంగా కె.జగన్నాథపురం నుంచి ముక్తేశ్వరం సెంటర్ ఆరు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా దెబ్బతిందన్నారు. నాలుగు నియోజకవర్గాలను కలుపుతూ ఏర్పాటు చేసిన ఈ రహదారి దెబ్బతినడంతో ప్రయాణికులు, చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయం, ముక్తేశ్వరం క్షణముక్తేశ్వరాలయం, వానపల్లి పళ్లాలమ్మ ఆలయం, వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం వంటి ప్రముఖ ఆలయాలకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో అనువుగా ఉందన్నారు. ఇటువంటి ప్రముఖమైన రహదారిని అభివృద్ధి చేయకుండా వదిలేయడం ఎంతవరకూ సమంజసమో పాలకులకే తెలియాలన్నారు. తర్వితగతిన ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, అంబాజీపేట మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, నాయకులు బూడిద వరలక్ష్మి, కుడుపూడి విద్యాసాగర్, విళ్ల శుభాకర్, పేరిచర్ల గణపతిరాజు, చేట్ల రామారావు, మిండగుదిటి రాంబాబు, మిండగుదిటి శిరీష్ నారాయణస్వామి, గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నూతన కమిటీల ఎన్నిక



అంతర్వేది దేవస్థానం గ్రామంలో నూతన కార్యవర్గ సభ్యులతో నాయకులు

మలికిపురం: మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆదేశాల మేరకు మలికిపురం మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ అధ్యక్షతన గుడిమెళ్లంక వైఎస్సార్ సీపీ నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా బళ్ళ కిరణ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు పరిశీలకుడిగా మంగెన సింహాద్రి, జిల్లా సెక్రటరీ కార్యదర్శి మోకా సురేష్ , రాజోలు నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది దేవస్థానంలో..

సఖినేటిపల్లి: నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు సూచనలతో నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు నక్కా రామారావు అధ్యక్షతన కమిటీ ఎంపిక చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా గునిశెట్టి వాసు, ప్రధాన కార్యదర్శిగా నల్లి ఆశీర్వాదం ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దొంగ ఏసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈద రవిరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, నాయకులు కొల్లాబత్తుల విజయరత్నం, పెచ్చెట్టి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పొదలాడలో..

రాజోలు: వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎన్నిక మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సూచనలతో నిరాటంకంగా ఏర్పాటు చేస్తున్నామని మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పార్టీ నాయకుడు లిఖితపూడి బుజ్జి అధ్యక్షతన పొదలాడ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దొమ్మేటి సోమరాజు, ప్రధాన కార్యదర్శులుగా రొక్కం రాజారావు, ముత్యాల వాసు, కర్రి రాంబాబు, ముడకల వాసు, కార్యదర్శులుగా కడలి గోపాలకృష్ణ, కడలి ప్రసాద్, కోళ్ల విజయ్‌ప్రసాద్, గెద్దం వెంకటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ మద్దుల కాసుబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, మండల కార్యదర్శి కామాడి సత్తిబాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుంగ శ్రీనివాస్, గెద్దం సునీల్, ఉండ్రు జాన్, కంబాల జగదీష్, మొల్లేటి వాసు తదితరులు పాల్గొన్నారు.